క్లుప్తంగా

ఓపెన్ యూనివర్సిటీ అడ్మిషన్ల గడువు పొడిగింపు

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్టడీ సెంటర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం అడ్మిషన్లు పొందేందుకు సెప్టెంబర్ 20వతేదీ వరకు గడువు పొడిగించినట్లు, రూ.200 అపరాధ రుసుముతో సెప్టెంబర్ 30వ తేదీ వరకు అడ్మిషన్లు పొందవచ్చని స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ నర్సింగ్ కోటయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 73829 29640ను సంప్రదించాలని కోరారు.

ఆర్టీసీ విలీన ప్రక్రియ వేగవంతం చేయాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్ : ఆర్టీసీ విలీన ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేయాలని ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ రీజినల్ సహాయ కార్యదర్శి వినయ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనంతో కార్మికులకు జరిగే నష్టాలను నియంత్రించాలని కోరుతూ ఆ యూనియన్ రాష్ట్ర కమిటీ ముద్రించిన కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ డిపో అధ్యక్ష, కార్యదర్శులు కె.రాములు, పి.బాలయ్య, నాయకులు చంద్రయ్య ఉన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న బుడిగ వెంకటేష్

డిండి : మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆ సంఘం కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. అనంతరం సంఘం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష, కార్యదర్శులుగా దేవేందర్, కృష్ణ ఎన్నికయ్యారు. సమావేశంలో దేవరకొండ డివిజన్ అధ్యక్షుడు రమావత్ లక్ష్మణ్ నాయక్, కుర్ర రాహుల్, శ్రవణ్ తదితరులున్నారు.

పులిచర్లను మండలంగా ప్రకటించాలి



నిరాహార దీక్షలో పాల్గొన్న నాయకులు

పెద్దవూర : మండలంలోని పులిచర్లను నూతన మండలంగా ఏర్పాటు చేయాలని, చేసే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు గడ్డంపల్లి వినయ్‌రెడ్డి అన్నారు. పులిచర్లను మండలంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ పులిచర్ల మండల సాధన సమితి ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన రిలే నిరాహార దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలానికి కావాల్సిన అన్ని మౌలిక వసతులు ఉన్న పులిచర్లలో ఉన్నాయని, మండలంగా ఏర్పాటు చేస్తే పెద్దవూర, పీఏపల్లి మండలాలకు చెందిన 12 గ్రామపంచాయతీల ప్రజల ఇబ్బందులు తీరుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దేవసాని లక్ష్మమ్మ, వెంకటయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, మునిలాల్, లక్ష్మయ్య, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు పురుగుల బియ్యంతో వడ్డిస్తున్న ప్రభుత్వం



పాఠశాలలో విద్యార్థినులతో కలిసి భోజనం రుచి చూస్తున్న జైవీర్‌రెడ్డి

హాలియా : సర్కార్ బడుల్లో విద్యార్థులకు సన్న బియ్యం పెడుతున్నామని గొప్పలు చెప్పుకుంటున్న బీఆర్ఎస్ ప్రభుత్వం ముక్కిన బియ్యం, పురుగులు పట్టిన బియ్యంతో మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు వండిపెడుతున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకుడు కుందూరు జైవీర్ రెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో పురుగుల అన్నం విడ్డించారనే విషయం తెలుసుకున్న ఆయన శుక్రవారం స్థానిక హైస్కూల్‌ను సందర్శించారు. విద్యార్థులను, ఎంఈఓ బాలునాయక్, పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం, ఏజెన్సీ నిర్వాహకులను జరిగిన సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకునూరి నారాయణగౌడ్, మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, చింతల చంద్రారెడ్డి, రాజా రమేష్‌యాదవ్, కౌన్సిలర్ సుధారాణి, శ్రీనివాస్ ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో వంట..తంటా

- సరైన వంట గది లేక ఏజెన్సీల ఇబ్బందులు
- వర్షం వస్తే విద్యార్థులకు మధ్యాహ్నం పస్తులే
- సమస్య పరిష్కరించాలని విద్యార్థులు, ఏజెన్సీల వేడుకోలు

కొండమల్లేపల్లి : ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ విద్యకు ధీటుగా కొనసాగించాలని ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో మాత్రం ఫలితాలు రావడం లేదు. విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం సర్కారు బడుల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించింది. భోజనాన్ని తయారు చేసేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో వంటగదులను సైతం నిర్మించింది. కానీ అవి పలు పాఠశాలల్లో శిథిలావస్థకు చేరడంతో వర్షాకాలంలో ఏజెన్సీలు వంట చేసేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ప్రతి సంవత్సరం వంటగదుల నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేల కోట్ల రూపాయల నిధులు విడుదల చేస్తున్నప్పటికీ ఫలితాలు మాత్రం ఆశించిన స్థాయిలో రావడం లేదు. విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడం.. ఉపాధ్యాయులు పట్టించుకోకపోవడం.. ప్రజాప్రతినిధులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం వంటి కారణాలతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారుతుంది.

వర్షం వస్తే పస్తులే..

వర్షాలు వస్తే చాలు మధ్యాహ్న భోజనానికి సెలవు ఇవ్వాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. వంట గదులు లేకపోవడంతో ఏజెన్సీ మహిళలు ఆరుబయటే మధ్యాహ్న భోజనం వండిపెట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. ముఖ్యంగా మండలంలోని కొత్తబావి గ్రామపంచాయతీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఈ పరిస్థితి మరీ దారుణంగా మారింది. ఈ పాఠశాలలో సుమారు 41మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అయితే నిత్యం 38మంది విద్యార్థులు హాజరవుతుండగా వారికి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయడానికి సరైన వంటగది లేకపోవడం, ఉన్న గదికి పైకప్పు మొత్తం గాలికి లేచి రేకులు పగిలిపోవడంతో వర్షాలు వచ్చినప్పుడల్లా వారికి వండి పెట్టడం కూడా తీవ్ర ఇబ్బందిగా మారుతుందని వంట కార్మికురాలు వాపోతుంది. పలుమార్లు అధికారులకు, సర్పంచ్‌కు తెలిపినా పట్టించుకోవడం లేదని పేర్కొంది. ఇదిలా ఉండగా మన ఊరు మన బడి ప్రణాళికలో భాగంగా నూతన భవన నిర్మాణానికి సంబంధించి రూ.49లక్షల11వేలు మంజూరయ్యాయి. ఇందులో కూడా వంటగది నిర్మాణానికి రూ.4.20లక్షలు కేటాయించారు. అయితే కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో పాఠశాల భవనాన్ని మధ్యలో వదిలేయడంతో పాటు, వంట గది నిర్మాణం చేపట్టలేదని స్థానికంగా ఉన్న ఉపాధ్యాయులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వంటి గది నిర్మాణానికి నిధులు విడుదల చేయించి పనులు పూర్తి చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



కొత్తబావి గ్రామంలోని పాఠశాలలో శిథిలావస్థకు చేరిన గదిలో భోజనం వండుతున్న నిర్వాహకురాలు



ఈదురుగాలులకు లేచిన వంటగది పైకప్పు

> **నిధులు విడుదల కాగానే వంటగది నిర్మిస్తాం**
>
> ఇటీవలనే కలెక్టర్‌తో జరిగిన సమావేశంలో ఈ విషయాన్ని చర్చించడం జరిగింది, వెంటనే బిల్లులు పూర్తి చేసి ఈ రెండు మూడు రోజుల్లో పాఠశాల భవన మిగతా పని పూర్తి చేయడంతో పాటు, వంట గది నిర్మాణం, పాఠశాలకు సంబంధించి చుట్టూ బౌండరీ పూర్తి చేయనున్నట్లు తెలిపారు.
>
> – ధర్మేంద్ర, పంచాయతీరాజ్ ఏఈ

నేడు సినీ హీరో అల్లు అర్జున్ రాక

పెద్దవూర : మండలంలోని ముసలమ్మచెట్టు స్టేజీ (కొత్తగూడెం) వద్ద నూతనంగా నిర్మించిన కంచర్ల కన్వెన్షన్ హాల్‌ను ప్రారంభించడానికి నేడు మండలానికి సినీ హీరో అల్లు అర్జున్ రానున్నట్లు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, కేసీఆర్ ఫౌండేషన్ చైర్మన్, అల్లు అర్జున్ మామ కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని ముసలమ్మచెట్టు స్టేజీ వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కన్వెన్షన్ హాల్‌ను ఉదయం 11గంటలకు సినీ హీరో అల్లు అర్జున్‌తో పాటు, రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి హాజరై ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మున్సిపల్ చైర్మన్‌లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ప్రజాప్రతినిధులు రానున్నట్లు తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పదివేల మందికి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గాలి సైదిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, టోనీ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు సుంకిరెడ్డి సంజీవరెడ్డి, కృష్ణప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి

కంచర్ల కన్వెన్షన్ స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ..

నేడు సినీ హీరో అల్లు అర్జున్ ప్రారంభించనున్న కంచర్ల కన్వెన్షన్‌హాల్‌ను శుక్రవారం మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి పరిశీలించారు. ఆయన వెంట కేసీఆర్ ఫౌండేషన్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి, హాలియా సీఐ గాంధీనాయక్, ఎస్ఐలు రమేష్‌అజ్మీరా, గాలి సైదిరెడ్డి తదితరులు ఉన్నారు.

కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి



దీక్షలో మాట్లాడుతున్న రామస్వామి

దేవరకొండ : పట్టణంలోని ప్రాంతీయ ఆస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రాంతీయ ఆస్పత్రి ఆవరణలో శానిటేషన్ కార్మికులు చేపట్టిన రిలే దీక్షకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మద్దతు తెలిపి ఆయన మాట్లాడారు. వంద పడకల ఆస్పత్రికి అనుగుణంగా ఆస్పత్రిలో పనిచేసే కార్మికులకు వేతనాలు చెల్లించాలని ఆయన అన్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో 45మంది కార్మికులు పని చేస్తుండగా కేవలం 32మంది కార్మికులకు మాత్రమే వేతనాలు చెల్లిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కార్మికులకు పూర్తిస్థాయి వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో జూలూరి వెంకట్రాములు, మల్లయ్య, శానిటేషన్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ఘనంగా శ్రావణ మాస పూజలు

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని సాగర్‌రోడ్డులో గల శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో శ్రావణమాసం తొలి శుక్రవారం పురస్కరించుకొని మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో కుంకుమార్చన, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంశెట్టి పాండరయ్య, ధనుంజయ్య, వెంకటేశ్వర్లు, భక్తులు పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలోని మహిసాసురమర్ధిని అమ్మవారి దేవాలయంలో శ్రావణమాసం ప్రత్యేక పూజలను భక్తులు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకాలను నిర్వహించి అలంకరించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు వెల్లటూరి రాంమోహన్‌శర్మ వేదమంత్రోత్సవాల మధ్య పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



కొండమల్లేపల్లి : కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

నాగార్జునసాగర్ : నందికొండలోని ఆలయాల్లో శ్రావణ మాసం వ్రతాలు మొదలయ్యాయి. శుక్రవారం సత్యనారాయణస్వామి ఆలయంలో భక్తులు అమ్మవారిని అలంకరించి సామూహికంగా పూజలు నిర్వహించారు. వరలక్ష్మి కథను అయ్యవారు భక్తులకు వినిపించారు. అనంతరం అమ్మవారికి మంగళహారతులతో వాయినమిచ్చారు.

పేద ప్రజలను మభ్యపెడుతున్న సీఎం కేసీఆర్

మిర్యాలగూడ టౌన్ : ప్రతి ఎన్నికల్లో పేద ప్రజలను మభ్యపెడుతూ అధికారంలోకి వస్తున్న కేసీఆర్‌కు రానున్న ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాస్‌రావు, అసెంబ్లీ ప్రభారీ గోగిరెడ్డి లచ్చిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట పేదలకు సంక్షేమ పథకాల అమలులో కేసీఆర్ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ భాణావత్ రతన్‌సింగ్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిప్రతం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రేపాల పురుషోత్తంరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, పట్టణ అధ్యక్షుడు దొండపాటి వెంకట్‌రెడ్డి, పులి విద్యాసాగర్, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కోశాధికారి కన్మంతరెడ్డి అశోక్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సీహెచ్ సీతారాంరెడ్డి, కొండేటి సరిత, శేఖర్, జానకిరాంరెడ్డి, వెంకన్న, జ్యోతి, తదితరులున్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

దేవరకొండ : సీఎం కేసీఆర్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ఏటి కృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లాలునాయక్ డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వారు మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చెనమోని రాములు, అంకూరి నర్సింహ, కళ్యాణ్‌నాయక్, వినోద్‌రాథోడ్, అంజయ్య, సైదులు, రమేష్, అంజినాయక్, బహదూర్‌సింగ్, వెంకట్‌రెడ్డి, తదితరులున్నారు.



దేవరకొండ : వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

'వయ్యారిభామ'ను సమూలంగా నిర్మూలించాలి



వయ్యారిభామ కలుపు నివారణపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త చంద్రశేఖర్

త్రిపురారం: వివిధ పంటల్లో చీడపీడల వ్యాప్తికి కారణమవుతున్న వయ్యారి భామ కలుపు మొక్కలను సమూలంగా నిర్మూలించాల్సి అవసరం ఉందని కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్ సేద్యపు విభాగం శాస్త్రవేత్త డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్‌లో వయ్యారి భామ కలుపు మొక్కల నివారణపై జిల్లాలోని రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. పార్థీనీయం కలుపు మొక్క విత్తనాలు పొరుగు దేశం నుంచి 65 సంవత్సరాల క్రితం మన దేశంలో ప్రవేశించిందన్నారు. పార్థీనియం మొక్కల వల్ల పంట దిగుబడులు గణనీయంగా తగ్గడమేకాకుండా మనుషులకు, పశువులకు శ్వాస, చర్మ సంబంధిత వ్యాధులు వస్తాయన్నారు. వయ్యారి భామ ఆకులను తిని పెరిగే జైగోగ్రామ, బూకోలారేటా పెంకు పురుగులను హెక్టారుకు 500 నుంచి 1000 వరకు విడుదల చేయడం వల్ల వయ్యారి భామ కలుపు మొక్కలను నివారించవచ్చన్నారు. పార్థీనియం కలుపు మొక్క పూత రాకముందే భూమిలో నుంచి తొలగించి తగలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త పల్లవి, వివిధ మండలాల రైతులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

పెద్దవూర : సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రశిక్షణ ప్రముఖ్ గుర్రం ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 21న తపస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించనున్న మహాధర్నా పోస్టర్లను శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టి పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం కె.శ్రీనివాస్, తపస్ మండల అధ్యక్షుడు అలుగుబెల్లి కర్ణాకర్‌రెడ్డి, రేపాల అశోక్, జిల్లా బాధ్యులు జి.రామ్మోహన్, గుర్రం సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి : సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని ప్రవేశపెట్టాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కోట్ల యాదగిరి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంప్లెక్స్ పరిధిలోని కొందరు ఉపాధ్యాయుల జీతాలు నిలుపుదల చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలలో జాప్యాన్ని, తదితర డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో గ్యార సంపత్, ఇస్లావత్ హనుమంతు, వై.శ్రీరాములు, సత్యనారాయణ, గోవర్ధన్, నరసింహ, శ్రీనివాస్, ఆనంద్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.



పెద్దవూర : పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

అవినీతి విద్యాధికారులను సస్పెండ్ చేయాలి

మిర్యాలగూడ : ఉపాధ్యాయుల అక్రమ డిప్యూటేషన్లకు వ్యతిరేకంగా గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశం మాట్లాడుతూ.. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జి.నాగమణి, నాయకులు బి.శ్రీనివాస్‌చారి, ఎం.శ్రీనివాస్‌రెడ్డి, చినవెంకన్న, విజయలక్ష్మి, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్నను ఆదర్శంగా తీసుకోవాలి

- ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ అర్బన్ : సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌ను నేటి తరం యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. శుక్రవారం పట్టణంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాపన్నగౌడ్ బహుజన రాజ్యస్థాపనలో ధైర్యంతో ముందడుగు వేయడంతో పాటు రాజ్యాధికారం సాధించాడని గుర్తుచేశారు. ఆయన స్ఫూర్తితో నేటి తరం యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, కాంగ్రెస్ నాయకులు నూకల వేణుగోపాల్‌రెడ్డి, గౌడ సంఘం నాయకులు గుండు శ్రీరాములుగౌడ్, జేరిపోతు రాములుగౌడ్, చౌగాని వెంకన్నగౌడ్, గంగావరప్రసాద్‌గౌడ్, డాక్టర్ జాడి రాజు, ఎంసీపీఐయూ నాయకులు మట్టయ్య, మాల మహానాడు నాయకులు తాళ్లపల్లి రవి తదితరులున్నారు.

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని నేతాజీ హైస్కూల్‌లో శుక్రవారం సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న చిత్రపటానికి పాఠశాల కరస్పాండెంట్ శ్రీపతి శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు మురళి, కవిత, ఉపాధ్యక్షులు నూరి బేగం, జబీన్, కళ్యాణి, సునిత, వెంకన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవరకొండ : మండల పరిధిలోని తాటికోల్ గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న 373వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ గౌడ గీత సంఘాల సమన్వయ కమిటీ జిల్లా చైర్మన్ చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. దళిత, బహుజన రాజ్యాధికారం కోసం ఎన్నో పోరాటాలు నిర్వహించిన గొప్ప వ్యక్తి సర్దార్ సర్వాయి పాపన్న అని కొనియాడారు. కార్యక్రమంలో భాస్కరాచారి, కొర్ర లచ్చిరాం, వీరయ్యగౌడ్, రేణుగౌడ్, ఆంజనేయులుగౌడ్, తిర్పతయ్య, బాలయ్య, బాలచందర్, తదితరులున్నారు.



దేవరకొండ : సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

పాపన్న ఆశయ సాధనకు కృషి చేయాలి

హాలియా : సర్దార్ సర్వాయి పాపన్న ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని తెలంగాణ కల్లు గీత సంఘం అనుముల మండల అధ్యక్షుడు కాట్నం యాదగిరిగౌడ్ అన్నారు. శుక్రవారం పట్టణంలో అనుముల మండల గౌడ సంఘం కమిటీ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సంఘం నాయకులతో కలిసి సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. బీసీల అభివృద్ధికి ఎంతగానో కృషి చేసిన వ్యక్తి పాపన్న అని అన్నారు. 400 సంవత్సరాల క్రితం బహుజనులకు రాజ్యాధికారం పంచిన ఘనత సర్దార్ సర్వాయి పాపన్నకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు వేముల పుల్లయ్య, యాచారం సర్పంచ్ చెదురుపల్లి రాములుగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి నర్సింగ్ సైదులుగౌడ్, ఉపాధ్యక్షుడు కాసాని సత్తయ్యగౌడ్, యూత్ అధ్యక్షుడు కాట్నం నాగరాజుగౌడ్, నాయకులు దేవరకొండ లింగమయ్యగౌడ్, పందుల సైదులుగౌడ్, ఎల్లయ్యగౌడ్, మహేష్‌గౌడ్, తదితరులు ఉన్నారు.



మిర్యాలగూడ అర్బన్ : సర్వాయి పాపన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక చౌరస్తా వద్ద పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల విముక్తి కోసం సర్వాయి పాపన్న పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో పందుల కోటయ్య, బొడిగె శంకర్, సురకారపు చినమారయ్య, సురకారపు పెద్ద మారయ్య, బాలరాజుగౌడ్, వీరమళ్ల ఎల్లయ్య, గణేశ్, శివ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్రంపోడు : మండల కేంద్రంతో పాటు కొప్పోలు, నడికూడ, బొల్లారం, వెంకటాపురం, తేనపల్లి, పాల్వాయి గ్రామాల్లో శుక్రవారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో గౌడ సంఘం మండల శాఖ అధ్యక్షుడు ఐతగోని వెంకటేశం, నాయకులు వడ్డగోని గంగాధర్‌గౌడ్, రఘుగౌడ్, లాలయ్యగౌడ్, నర్సింహగౌడ్, కల్యాణ్, గిరి శ్రీను, ముత్తయ్య, శేఖర్ పాల్గొన్నారు.



హాలియాలో సర్వాయి పాపన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు



కొండమల్లేపల్లిలో..



గుర్రంపోడు : నడికూడలో పాపన్నగౌడ్ జయంతిలో పాల్గొన్న నాయకులు

సంక్షిప్త సమాచారం

నూతన పంచాయతీలుగా ఏర్పాటు చేయాలి

చందంపేట : మండలంలోని కంబాలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఈదమ్మగడ్డ, నిడిగల్, ఏలేశ్వరం గ్రామాలను నూతన గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ నాయకులు గన్నెబోయిన మల్లేశ్‌యాదవ్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

డిండి : మండలంలోని ఐటీఐ కళాశాలలో మూడో విడత ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బి.మల్లయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకే https:// iti. telangana. gov. in ద్వారా దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని, ఈనెల 30వరకు గడువు ఉందని తెలిపారు. వివరాలకు 9441237136ను సంప్రదించాలన్నారు.

పోలీసులపై చర్యలు తీసుకోవాలి

మిర్యాలగూడ అర్బన్ : గిరిజన మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన ఎల్‌బీ నగర్ ఇద్దరు పోలీసులను విధుల నుంచి తొలగించి చర్యలు తీసుకోవాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ముడావత్ రవినాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఆర్థికసాయం అందజేత

గుర్రంపోడు : మండలంలోని ఆములూరు గ్రామానికి చెందిన వీఓఏ గనిపెల్లి పెదవెంకన్న ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. దీంతో అతడి కుటుంబానికి వీఓఏల సంఘం మండల కమిటీ, ఐకేపీ సిబ్బంది జమచేసిన రూ.74వేల ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబానికి శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం మైసేశ్వర్‌రావు, సీసీలు రాజేశ్వరి, శ్రీశైలం, శేఖర్, సంధ్య, పద్మ, వీఓఏల సంఘం అధ్యక్షురాలు సల్వాది సైదమ్మ, శంకర్, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు షూ, టై, బెల్టుల పంపిణీ

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మండలంలోని రాజవరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పాఠశాల హెచ్ఎం జె.వెంకటరాములు తన సొంత ఖర్చులతో శుక్రవారం విద్యార్థులకు షూ, టై, బెల్టులు, సాక్సులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం సైదానాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో రికార్డుల పరిశీలన

త్రిపురారం : మండల కేంద్రంలోని విశ్వభారతి పాఠశాలలో అసిస్టెంట్ స్టాటికల్ అధికారి(ఏఎస్ఓ) ఆదినారాయణ, జిల్లా కామన్ పరీక్షల బోర్డు అధికారి కొప్పుల శ్రీనివాస్ మండల విద్యాధికారి బాలాజీనాయక్‌తో కలిసి శుక్రవారం పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం మండలంలోని బాబుసాయిపేటలో గల కస్తూరిబా గాంధీ పాఠశాలను అకస్మికంగా తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు.

తేరా భిక్షంరెడ్డికి జానారెడ్డి పరామర్శ

హాలియా : అనుముల మండలంలోని పంగవానికుంట గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తేరా భిక్షంరెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురై నల్లగొండలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో విషయం తెలుసుకున్న మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

దేశ సమగ్రతకు పనిచేస్తామని ప్రతిజ్ఞ

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ మున్సిపల్ ఉద్యోగులు, మెప్మా రిసోర్స్‌పర్సన్లతో ఆజాదీ కా అమృత్ కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సలీం, మున్సిపల్ డీఈ సాయిలక్ష్మి, మెప్మా టీఎంసీ పోతేపాక బక్కయ్య, సీనియర్ అసిస్టెంట్ హసీంబాబా, పర్యావరణ ఇంజనీరు శ్వేతారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, మెప్మా సీఓ శ్రీనివాస్, సిబ్బంది తదితరులున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లఘించిన పోలీస్ ఉద్యోగి

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని చౌరస్తాలో దేవరకొండ డీఎస్పీ కార్యాలయంలో పనిచేసే ఓ పోలీసు ఉద్యోగి శుక్రవారం ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా రోడ్డులో కారును అడ్డంగా నిలిపి ఫోన్లో అర్ధగంటకు పైగా మాట్లాడారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దేవరకొండ నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు హారన్ కూడా పట్టించుకోకుండా అలానే ఫోన్‌లో మాట్లాడడంతో చివరికి ఆర్టీసీ డ్రైవర్ ఆ కారు పక్క నుంచి అతి కష్టం మీద బస్సును మలుపుకొని బస్టాండుకు వెళ్లాల్సిన పరిస్థితి. ఇది చూసిన స్థానిక ప్రజానీకం ట్రాఫిక్ రూల్స్ కేవలం సాధారణ పౌరులకేనా.. పోలీసులకు వర్తించవా అంటూ.. సదరు పోలీస్ ఉద్యోగి తీరు పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

భూ నిర్వాసితులకు పునరావాసం కల్పించాలి

అడవిదేవులపల్లి : టెయిల్‌పాండ్ భూ నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని సీపీఎం మండల కన్వీనర్ కుర్ర శివనాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని చిట్యాల గ్రామంలో భూ నిర్వాసితులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పునరావాసం కోసం సర్వేలు చేసి ఆయా గ్రామాల వారికి పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రాంబాబు, రామాంజనేయులు, హరినారాయణ, వెంకయ్య తదితరులున్నారు.